# వాళ్ళుండేదాన్నిబట్టి గదయ్యా మనముండేది!



భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి



సర్వస్వామ్యములు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్ట్ వారివి

ప్రతులు : 5,000

ప్రథమ ముద్రణ : ఆగష్ట్ 2007

వెల :

కాపీల కొరకు : శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా 524 321

Please visit : www.saimastersevatrust.org

# వాళ్ళుండేదాన్నిబట్టి గదయ్యా మనముండేది!

మనలెక్కలో పుణ్యమెక్కువగా ఉంటే అది మనలను శుభ్రమార్గానికి ఎలా నెడుతుందో ఆ మార్గంలో మరలా తప్పులు చేయకుండా ఎలా కాపాడుతుందో తెలిపేవే శ్రీ డి. నాగేశ్వరరావుగారు, స్కూల్ హెడ్మాష్టర్, దమ్మపేట వారి అనుభవాలు.

శ్రీ వెంకయ్యస్వామివారు "వాళ్ళుండేదాన్నిబట్టి గదయ్యా మనముండేది" అన్నమాట సత్యమని వీరి అనుభవాలు ఋజువు పరుస్తున్నాయి.

దమ్మపేట డి. నాగేశ్వరరావుగారు గత ఆరు సం||ల నుండి వారి గ్రామములోని సాయి మందిరములో నిత్యం ఉదయం నాలుగు గం||లకు వెళ్ళి మూడు పొర్లు దండాలు, తడి బట్టలతో అరగంట నామస్మరణతో ప్రదక్షిణలు, బాబాకు ఉదయహారతి ఇంకా సేవా కార్యక్రమములు మొత్తం 6$^1/_2$ గంటల వరకు చాలా ఖచ్చితంగా ఎప్పుడూ మందిరంలో సమయాన్ని వినియోగించి క్రమము తప్పకుండా చేస్తూ వస్తున్నారు. ఎప్పుడయినా రెండు నిమిషాలు లేటయినా, తేడా వచ్చినా ఆ రోజంతా భోజనం మానేసి పచ్చి మంచినీరు మాత్రమే త్రాగి శిక్ష వేసుకొని చాలా శ్రద్ధ, పట్టుదలతో కాలమును దైవానికిచ్చి సేవిస్తున్నారు. ఈ మధ్య ప్రక్కగ్రామానికి ట్రాన్స్‌ఫర్ అయినందున స్కూల్‌కు లేటవుతుందేమోనని ఒకరోజు రెండు నిమిషాలు ముందుగా ప్రదక్షిణలు ముగించారు.

రెండవ నాడు వారి స్వప్నంలో శ్రీస్వామివారు వారిని కాలరు పట్టుకొని లాక్కొచ్చి మందిరంలోని గడియారం చూపుతున్నారు. అందులో టైమ్ 6 గం|| 28 నిమిషాలు అయినది. గడియారము



తప్ప అక్కడున్న అల్మారాలు, విగ్రహం, పటాలు ఏవీ కనపడటం లేదు. స్కూలుకు టైమ్ అయిపోతుందని రెండు నిమిషాల ముందు ప్రదక్షిణలు ముగిస్తున్నందుననే శ్రీస్వామివారు ఇలా చూపారని, ఇక ముందు అలాచేయకూడదని గ్రహించారు. మనం చిన్న తప్పులని భావించేవి కూడా ఆధ్యాత్మిక మార్గంలో పెద్ద తప్పులేనని శ్రీస్వామివారు బోధిస్తున్నారు. కాల నియమము - దాని పట్ల మన శ్రద్ధను బట్టి వారి కృప చూపడం ఉంటుందని అందరికీ కూడా వారి అనుభవంద్వారా బోధిస్తున్నారు. అందరికీ ఎందుకు శ్రీస్వామివారు చెప్పరు అంటే అంత శ్రద్ధగా చేసే వారికి మాత్రమే శ్రీస్వామి చెప్పటం జరుగుతుందని, కనుక మనం కూడా అట్టి శ్రద్ధను, పట్టుదలను అలవరచుకొని ఒకే కాలంలో రోజూ భగవంతుని స్మరించాలని దానిని బట్టి వారి కృప పొందటము తథ్యమని మానవాళి అందరికీ శ్రీస్వామి వారి బోధ. అంతేకాదు అట్లా చేస్తున్నవారిని ఎల్లవేళలా కంటికి రెప్పలా అటు ఐహికంగాను, ఇటు సన్మార్గంలోనూ కూడా రక్షణ అందిస్తారని వీరి అనుభవాలు మనందరికీ తెలియ పరుస్తున్నాయి. వారంత ఖచ్చితంగా చేస్తున్నందుననే శ్రీస్వామివారు చిన్న తప్పులు కూడా చేయకుండా రక్షణ అందిస్తూ నడిపిస్తున్నారనే మరొక అనుభవం కూడా తెల్పుచున్నది.

2005 సం||లో వారి స్వప్నంలో గొలగమూడిలోని శ్రీ బ్రహ్మంగారి మఠంలో నిత్యం జరిగే సత్సంగం కన్పిస్తున్నది. "సద్గురు కృప పొందడమనేది మానవుని జీవిత విధానం మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు దమ్మపేట డి. నాగేశ్వరరావుగారి జీవితవిధానం వల్లనే వారంతగా గురుకృప పొందగల్గారు." అని సత్సంగంలో శ్రీ సుబ్బరామయ్య మాష్టరుగారు చెపుతున్నారు. వెంటనే మఠం యొక్క ఒకవైపు నుండి శ్రీబాబాగారు, మరియొక వైపు నుండి శ్రీ వెంకయ్యస్వామివారు సెల్‌ఫోన్ సైజ్‌లో ఉండే చిన్నపెట్టె

(కలైడోస్కోప్)తో వచ్చి దానికి ఉండే చిన్న గుబ్బను త్రిప్పుతుంటే ఆ పెట్టెలోపల ఫిల్ము తిరుగుతూ బొమ్మలు కన్పిస్తున్నాయి. చిన్న పిల్లలు దానిలోని బొమ్మలు చూస్తుంటారు. శ్రీస్వామి, శ్రీబాబాగారు ఆ పెట్టెలో ఏడు బొమ్మలు చూపించారు. 1. చాక్‌పీసుల గుట్ట, 2. తెల్లకాగితాలు, 3.కాకరకాయల గుట్ట, 4.బిస్కెట్లు, 5. కొబ్బరికాయలు, 6.జున్నుపాలు, 7.బియ్యము. మెలుకవ వచ్చి ఈ మహనీయులు స్వయంగా వచ్చి నాకెందుకీ ఏడు విషయాలు చూపారా అని యోచించగా వారికి ఈ ఏడు విషయాలు వారు చేసిన తప్పులని తెలిసింది. వారు స్కూలు హెడ్మాష్టరుగా పనిచేస్తున్నారు. 1. స్కూలులోని చాక్‌పీసులు తెచ్చి మందిరంలో నోటీస్ బోర్డు వ్రాసేందుకు, ముగ్గులు వేసేందుకు ఇస్తుంటారు. 2. స్కూలులోని తెల్లకాగితాలను ఒకరోజు వారి ఇంటి అవసరాలకు వాడారు. 3 వారు హెడ్మాష్టరు అనే అభిమానంతో ఎవరో వాళ్ళింట్లో కాసిన కాకర కాయలు ఇస్తే తీసుకున్నారు. అలాగే 4,5,6 బిస్కెట్లు, కొబ్బరికాయలు, జున్నుపాలు తీసుకున్నారు, 7. రేషన్‌బియ్యము తక్కువ ధరకిస్తే తీసుకున్నారు. ఇవన్నీ చాలా స్వల్పమైనవే అయినా ఆ మహనీయుల దృష్టిలో పెద్ద తప్పులేనని శ్రీస్వామివారు వారికి స్వప్నంలో దృశ్యంగా స్పష్టంగా తెలియ పరిచారు. వారు ఆ నాటి నుండి ఆ తప్పులన్నీ చేయకుండా చాలా జాగ్రత్తగా శ్రద్ధగా శ్రీస్వామిని సేవించుకొంటున్నారు.

ఆపదలో ఆదుకోవడమే గాకుండా సద్గురువును నిత్యము ఒకే కాలములో శ్రద్ధగా పారాయణ, ప్రదక్షిణలు హారతులు మొ॥ వాటిద్వారా సేవిస్తుంటే వారు మనలను ధర్మ మార్గంలో నడుపుతారని వీరి అనుభవం ద్వారా అందరికీ తెలుపుచున్నారు. మన శ్రద్ధ, భక్తి, పట్టుదల, విశ్వాసములను బట్టి శ్రీ స్వామి అనుగ్రహము పొందగలుగుతామని మానవాళికంతటికీ బోధిస్తున్నారు. వారుచేసే నిష్కామ కర్మే సద్గురు అనుగ్రహానికి



కారణం. కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, ధార్మిక విషయాలకు ఉదారంగా ఖర్చుపెట్టడం లాంటి పనుల వల్ల పుణ్యం జమ అయి సద్గురు కృప పొందగల్గుచున్నారు. కాలం, మనస్సు భగవంతునికి శ్రద్ధగా అర్పించుట వలన సద్గురుకృపను పొందగల్గుచున్నారు. అందరూ అట్టి శ్రద్ధతో సద్గురువును సేవిస్తే అందరూ సద్గురుకృపను పొందుతారని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

వారిదే మరొక అనుభవం. వారింట దొంగతనం జరిగితే శ్రీస్వామివారు రక్షణ అందించారు. 3-10-1995లో దశరా పండుగ రోజు వారి మామగారు చనిపోతే ఇంటికి తాళం వేసి అందరూ కామయ్యపాళెం వెళ్ళినారు. సాయంత్రం 5 గం॥కు దమ్మపేటలోని వారి ఇంట్లో దొంగలు పడగా దమ్మపేటలోని వారి బంధువులు ఈ వార్త చెప్పి మాష్టారిని రమ్మని ఫోను చేశారు. వారు ఇంటికి వచ్చేసరికి ఇంటి చుట్టూ జనం నిండి ఉన్నారు. ఏమేమి పోయాయో చూడమని యస్.ఐ గారు చెప్పగా వారు ఇంట్లో అంతా చూసుకున్నారు. మారుతాళంతో వాకిలి తాళము, బీరువా తాళం తీశారు దొంగలు. అన్ని సామానులు బంగారు, వెండి, 50 వేల రూ॥ పైన డబ్బు ఏదీ, ఒక్క పైసా గానీ, ఒక్క గుడ్డగానీ, పాత్ర సామాను గానీ, నగ కానీ, ఏదీ తీసుకపోలేదు దొంగలు. అన్నీ బీరువా బయటే పెట్టారు. యస్.ఐ. గారు పోతూ 'నా సర్వీసులో ఈవిధంగా దొంగలు పడి ఏవస్తువూ తీసుకోకుండా పోవడం చూడలేదు. ఇది కేవలం దైవ సహాయమే'నన్నారు. ఈ సన్నివేశం చూచి అందరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది, అన్న స్వామివారి మాట యదార్థమైనది. మనం శ్రీస్వామివారికి చెల్లించే కానుకలు మాత్రమేకాదు, మనం ఆచరించే సత్యం ధర్మం, కాలము, మనస్సు వారి కృప పొందేందుకు మార్గమని తెలుస్తున్నది.

**శ్రీస్వామివారు నాగేశ్వరరావుగారికి ప్రాణదానం చేసిన సన్నివేశం.** వారు ఒకసారి కురువపురం పోతూ అక్కడ కృష్ణా నదిని బుట్ట పడవలో దాటుచున్నారు. ఆ బుట్ట పడవ బొగ్గుల బస్తాలు మరియు జనంతో నిండిపోయి ఓవర్‌లోడ్ అయివుంది. బుట్ట పాతది అయినందువల్ల నది మధ్యలోకి వెళ్ళినాక చిల్లిపడి బుట్టలోనికి నీళ్ళు వస్తూ పడవ మునిగి పోసాగింది. కనుక బుట్ట నడిపేవాడు బుట్ట మునిగిపోతుంది. ఈత వచ్చిన వాళ్ళు మాత్రం బ్రతుకుతారు. మిగిలిన వారు చనిపోతారని కేకవేసి నీటిలో దూకాడు. పడవ మునిగి వారు నీటిలో ఉన్నారు. నాగేశ్వరరావుగారు గట్టిగా "సాయి, గురుదేవా నన్ను కృష్ణానదిలో మా రాష్ట్రంలో కాకుండా ముంచేస్తున్నావా స్వామీ! నాకు ఈత కూడా రాదు స్వామీ, చనిపోవడం ఖాయం. ఏమైనా రక్షించగలిగతే నీవల్ల మాత్రమే అవుతుంది." అని నీటిలో మునుగుతూ- తేలుతూ, ఏడుస్తూ ఉన్నప్పుడు బుట్టవాడు వారిని గట్టిగా పట్టుకొని అమాంతం ఒక బొగ్గుల బస్తాపై పడవేసి గట్టిగా పట్టుకోమన్నాడు. ఇంతలో ఆ బుట్టవాడు ఒక ఆడకూతురిని ఒడ్డుకు చేర్చేందుకు లాక్కుపోతున్నాడు. బుట్టవాడు వచ్చేవరకు ఈ బొగ్గుల బస్తా పట్టుకున్న నాగేశ్వరరావుగారు నీటిలో కొట్టుకు పోతున్నారు. అప్పుడు చాలా భయంతో ఉండగా ఆ బస్తా ఒక పెద్ద బండకు కొట్టుకొని ఆగిపోవడం విశేషం. వారు బొగ్గుల బస్తాను గట్టిగా కౌగలించి పట్టుకునియున్నారు. ఆ సమయంలో శ్రీగురుచరిత్ర పుస్తకం మరియు టవలు తప్ప మరేమియు వారి దగ్గర లేవు. బుట్టవాడు ఆడమనిషిని ఒడ్డుకు చేర్చి, వారి దగ్గరకు వచ్చి వారిని ఒడ్డుకు లాక్కుపోయాడు. ఈ ప్రమాదంలో పదవ తరగతి చదివే ఒక అమ్మాయి మరణించింది. వారు కేవలం శ్రీసాయి, స్వామి వల్లనే ఈ గండంలో నుండి రక్షింపబడ్డానని వారు సంపూర్ణ విశ్వాసంతో కృతజ్ఞతతో సద్గురు సేవలో గడుపుచున్నారు. శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి వారి



తప్పులు సరిచేయుట గురించి శ్రీ డి. నాగేశ్వరరావుగారు ఇలా చెబుతున్నారు.

అది ఏప్రిల్ 5వతేదీ, 2002 సం॥. రాత్రి నా స్వప్నంలో శ్రీస్వామివారు దమ్మపేట సత్సంగ సభ్యులను మందలపల్లి గ్రామంలో ఉన్న శిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణములోనికి తీసుకొని వెళ్ళినారు. ఆ ప్రాంగణమంతా నాపరాయి పరచబడి చాలా విశాలంగా ఉన్నది. మమ్ములను, మందలిపల్లి సత్సంగ సభ్యులను అందరినీ డ్రిల్ కొరకు డ్రిల్‌సార్ నిలబెట్టినట్లుగా దూరదూరంగా క్రమశిక్షణగా నిలబెట్టినారు. ఎదురుగా శ్రీభరద్వాజ గురువుగారు ఒక వైపు, శ్రీ వెంకయ్యస్వామివారు ఒక వైపు నిలబడి ఉన్నారు. వారు ఇద్దరు పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలు అనే విషయాలను గురించి ఏమిటో చెప్పుచున్నారు. నాకు ఏమియూ బోధ పడుటలేదు. అలా వరుసగా 5వతేదీ రాత్రి, 6వ తేదీ రాత్రి స్వప్నంలో కనబడటం అలా చెప్పుకుంటూ పోవడం జరిగింది. కానీ నాకు దాని అర్థం ఏమిటో ఏమియూ బోధపడలేదు. మూడవరోజు గురువుగారి వద్ద నా ఆవేదనను తెలియజేస్తూ ఏమైనా చెప్పాలంటే స్పష్టంగా తెలుపండి, నాకు దానికి అర్థం ఏమిటో ఏమియూ బోధ పడుటలేదు- అని కన్నీటితో చెప్పుకుని పడుకొన్నాను.

7వ తేదీ రాత్రి మరలా అదే మాదిరిగా స్వప్నం- ఒక వైపు గురువుగారు, మరియొకవైపు శ్రీవెంకయ్యస్వామివారు ఉన్నారు. సత్సంగ సభ్యులందరినీ మోకాళ్ళమీద నిలబెట్టి శ్రీవెంకయ్యస్వామివారు కళ్ళెర్రజేసి, ఉరిమి "అనుకున్నవి చెయ్యకపోతే శిక్షలు కఠోరంగా ఉంటాయి." అని పదే పదే బోధించారు. తరువాత కొద్ది సేపటికి స్వప్నం ముగిసింది. తెల్లవారిన వెంటనే నాకై నేను చేసిన రెండు దోషాలు నాకు తెలిసి వచ్చినవి.

1. ఏరోజైనా దమ్మపేట గ్రామంలో నిద్రచేసి ఉంటే ఆరోజు

తప్పక ఉదయం గం 5-15 ని|| ప్రార్థన చేయడం నా అలవాటు. కానీ ఆ వారంలో ఒకరోజు ఉదయం గం 5-10 ని|| వరకు ఉండికూడా ప్రార్థన చెప్పకుండా నా వ్యక్తిగత పని తొందరలో వెళ్ళిపోవడం జరిగింది. 2. గురుచరిత్ర మొత్తం ఒక గేయంగా వ్రాసి వున్నారు. దాన్ని నిత్యం పారాయణ చేస్తానని చెప్పుకుని యున్నాను. కాని మార్నింగు స్కూలు అయినందున గేయం చదవకుండానే స్కూలుకు వెళుతున్నాను. పై రెండు విషయాలు నేను చేస్తానని అనుకొని చేయకుండా మానివేసిన దానినే శ్రీస్వామివారు అలాపలికారు. ఈ లీలద్వారా శ్రీ స్వామివారు మానవాళికి ఎంతో గొప్ప సత్యాలు బోధిస్తున్నారు.

1. నేను పై విషయాలు చెప్పుకున్నప్పుడు శ్రీస్వామివారు భౌతికంగా మన ఎదుటలేరు. కానీ మన ప్రతిమాట, ఆలోచన, పనిని గుర్తిస్తూనే ఉన్నారు.

2. గుర్తించడమేగాక చెప్పుకున్న ప్రకారం చేస్తున్నాడా లేదా అని గమనిస్తున్నారు.

3. మనం మన మాట ప్రకారం నడుచుకోనప్పుడు అట్టి ప్రవర్తన తప్పు అని దానికి కఠిన శిక్షలు ఉంటాయనీ తెలుపుతున్నారు.

సత్యం, ధర్మం తప్పవద్దనేదే కదా శ్రీస్వామివారేగాక సర్వ మతాలు, సర్వశాస్త్రాలు చెపుతున్నవి. సత్యాన్ని తప్పకుండా శ్రీస్వామివారు అనుక్షణం నడిపిస్తున్నారని అర్థం. ఆ మహనీయుని నుండి అట్టి రక్షణ పొందినవారి జన్మలు ధన్యముగదా!

ఈ డి. నాగేశ్వరరావుగారు (దమ్మపేట) ఇంతకు ముందు వారికి జరిగిన మరొక అనుభవం ఇలా చెబుతున్నారు.

నేను 17-9-2001న మా పాపను తిరుపతిలో యమ్.యస్.సి (ఐ.యస్) ఎంట్రెన్స్ వ్రాయించి 18-9-2001న గొలగమూడి



శ్రీస్వామివారి సన్నిధికి తీసుక వచ్చాను. నేను వచ్చిన నాడు శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్నంత వరకు ద్రవాహారము, శ్రీస్వామివారి ప్రసాదము తప్ప మరేదియు తినకూడదు అని అనుకున్నాను. 19-9-2001 వరకు సజావుగానే నియమాన్ని పాటించ గలిగాను. కాని 20-9-2001న మా పాప నీవు టిఫిన్ తింటేనే నేను తింటాను అని పట్టు పట్టినందున తిన్నాను. ఆ రోజు రాత్రి గం 1-45 ని|| - 2.00 గం|| మధ్య శ్రీస్వామివారు స్వప్నంలో కనబడి ఎంతో దీనంగా నాతో స్వయంగా ఇలా అన్నారు. " అంతా చెప్పేవాళ్ళేనయ్యా, ఆచరించే వాళ్ళే లేరయ్యా" నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. నేను ఇలా ద్రవాహారమే తీసుకుంటానని అనుకున్నది నాకు తప్ప ఎవ్వరికీ తెలియదు. అలాంటిది శ్రీస్వామివారి దయ ఎంత గొప్పదో చూడండి. తన భక్తులను మార్గము తప్పుతున్నప్పుడు సక్రమమైన మార్గంలో పెట్టడానికి ఎంత కృషి చేస్తున్నారో అని ఈ సంఘటన ద్వారా నాకు తెలిసింది. అదే స్వప్నంలో నేను వెనుకకు తిరిగి వచ్చేస్తుంటే శ్రీస్వామివారు నా కుడికాలి పిక్క క్రింది భాగంలో గట్టిగా నొక్కినారు. ఎంతో బాధగా ఉంది. అయినా వారి స్పర్శభాగ్యం నాకు స్వప్నంలో ప్రసాదించిన కృపకు నేను ఎంతో ఋణగ్రస్థుడను. శ్రీస్వామివారి దయ, కృప, కరుణలను నేను ఏమని తెలుపగలను. శ్రీస్వామివారు వెంటఉండి మనలను నడిపించుతారని ఇది ప్రత్యక్ష నిదర్శనము.

నేను మా గ్రామములోని బాబా మందిరము చుట్టూ ప్రతిరోజూ అరగంట తడిబట్టలతో ప్రదక్షిణలు చేసే అలవాటు. గత కొన్ని సంవత్సరములగా స్వామి దయవల్ల జరుగుతుంది. ఏదైనా నా స్వంత పనిపై (గొలగమూడి తప్ప) వేరే గ్రామము వెళితే ఆ వెళ్ళిన రోజులలో అక్కడ ప్రదక్షిణలు చేయను. కావున వాటిని నోట్ చేసుకొని వచ్చిన తరువాత ఉదయం రెగ్యులర్ ప్రదక్షిణలు చేసి, బకాయలను సాయంత్రముగాని లేక పాఠశాలకు శెలవు

రోజులలోగాని చేసే ఆనవాయితీ నాది. ఇటీవల మా పాప, మా అల్లుడుగారు ముంబాయిలో ఉంటున్నందువలన నేను అక్కడకు వెళ్ళి 18 రోజులు బకాయి పడినాను. వచ్చిన తరువాత 2 రోజులు బకాయిలు మాత్రం చేసినాను. మిగిలిన 16 రోజుల ప్రదక్షిణలు రెండు నెలలు అయినను వాయిదా వేస్తున్నాను. ఇది ఇలా ఉండగా 4, 5 రోజుల నుండి మోకాలి క్రింద నుండి కాళ్ళు బాగా వాచి, సత్తువ తగ్గి పాఠశాలకు వెళ్ళినప్పటికి నీరసంగా ఉండేది. చాలా బాధగా అనిపించేది.

అప్పుడు నాకు ఒక స్వప్నం వచ్చినది. ఆ స్వప్నములో నేను మా ఇంటి వద్ద మంచంపై పడుకొని ఉన్నాను. నా కాళ్ళు వాచి ఉన్నందున నన్ను చూడటానికి చాలా మంది సత్సంగ సభ్యులు, బంధువులు వగైరా వచ్చి ఉన్నారు. వాళ్ళతో నేను మరియు మా శ్రీమతి మాట్లాడుతున్నాము. నా మంచానికి కొద్ది దూరములో ఒక ముసలివారు వచ్చి కూర్చున్నారు. మా శ్రీమతి ఆ తాతగారిని 'మా ఆయనకు బాగు చేయరా?' అని బ్రతిమలాడుతున్నది. ఆయన ఈవిధంగా అంటున్నారు. "వాయిదా వేయమను, వాయిదా వేయమను నేను తగ్గిస్తాను" అని వెళుతూ వెళుతూ "ఓం నారాయణ. ఓంనారాయణ" అంటూ అందరినీ ఆశీర్వదిస్తున్నట్లుగా అరచేతిని చూపిస్తున్నారు. అరచేతిపై 16 అని అంకె ఉన్నది. అప్పుడు నాకు స్వప్నంలో ఏమియును అర్థం కాలేదు. తెల్లవారి బాగా ఆలోచిస్తే నాకు అర్థమైన విషయం ఏమనగా నేను వెంకయ్యస్వామికి 16 రోజుల ప్రదక్షిణలు బాకీ పడి ఉన్నాను. దానినే శ్రీస్వామివారు వాయిదా వేయమంటున్నారని అర్థమైంది.

ఈ స్వప్న సందేశము అయిన తదనంతరం నుండి ప్రదక్షిణలు రెగ్యులర్‌వి గాక బాకీ పడినవి కూడా చేయటం మొదలు పెట్టినాను. నేను ఏ రకమైన మందులు వాడనప్పటికి కాళ్ళవాపు, అనారోగ్యము దానంతట అది తగ్గి బాగయినది. స్వామి ఆదేశాన్ని



తు॥చ తప్పక పాటించక పోవటము వలననే కాళ్ళలో నిసత్తువను, వాపు అనే మిషను పెట్టి స్వప్నసందేశము ఇచ్చి నా చేత వాయిదా వేయించకుండా ప్రదక్షిణలు చేయించుకున్నారు. ఇది అంతయు స్వామి దయ. నేను స్వామికి కృతజ్ఞుడను.

ఒక్కసారి మనం ఏమని నియమం పెట్టుకుంటామో, అది మరచినప్పటికి ఆ నియమాన్ని స్వామివారు గుర్తుచేస్తుంటారు అనటానికి ఇది ఒక మచ్చుతునక.

నా మిత్రుడొకడు గవర్నమెంటు పాలడయిరీలో ఉద్యోగమునకు సెలెక్టయ్యాడు - అతనిని ఉద్యోగములో పెట్టుకున్నట్లు నోట్ ఆర్డర్లు అయ్యాయి. కానీ అతనికి ఆర్డరు ఇవ్వకుండా పది సంవత్సరాలకుపైన జాప్యం చేశారు. అతడు తన మిత్రుని సలహాపై పదకొండు రోజులు ఒక్కపూట భోజనంతో నిత్యం శ్రీవెంకయ్యస్వామి మందిరానికి 108 ప్రదక్షిణలు, పారాయణ చేస్తూ గొలగమూడిలో ఉన్నాడు. ఇంటికి వెళ్ళిన నాలుగు రోజులకు ఉద్యోగంలో చేర్చుకున్నారు. కృతజ్ఞతాభావంతో నెలకొక రోజు శ్రీస్వామివారిని దర్శించి పోతుంటాడు.

2007 సం॥లో 5 సవర్లదొకటి, 3 సవర్లదొకటి బంగారు బిస్కెట్లు, 2 సెల్‌ఫోన్లు, DVD ప్లేయరును పై భక్తుని ఇంటి వెంటిలేటర్ పగులగొట్టి దొంగలు ప్రవేశించి దొంగిలించారు. ఆ బంగారు బిస్కెట్లలో ఒకటి వారి మామగారిది. ఈవిధంగా దొంగలెత్తుకపోయారని చెపితే వాళ్ళు నమ్మరని చాలా బాధ పడ్డారు. నా స్నేహితుని భార్య చాలా ఘోరంగా ఏడుస్తూ శ్రీస్వామి పటాల దగ్గర పడుకున్నది. పోలీసులొచ్చి అంతా చెక్‌చేసి రిపోర్టు వ్రాసుక పోయారు. తెల్లవారి బంగారు బిస్కెట్లు మాత్రం దొరికాయి. ఇది కేవలం వాళ్ళను అపవాదు భారం నుండి రక్షించేందుకే శ్రీస్వామివారు అలా రక్షించారు.

**చాపల వెంకటేశ్వరరావు, కన్నాపురము, పశ్చిమగోదావరి జిల్లా**

మొట్టమొదట మా అమ్మాయి ఎందుకో అనుకోకుండా "గొలగమూడి వెళ్ళండి నాన్నగారు" అని అన్నది. ఎందుకో నాకు తెలియదు. ఇంటిలోపలికెళ్ళి TV ఆన్ చేస్తే ఓం (om) ఛానల్‌లో ఈ గొలగమూడి గురించి చూపిస్తున్నారు. అప్పటి నుంచి గొలగమూడి ఉందని అర్థమైనది. ఇక్కడ వెంకయ్యస్వామి ఉన్నాడని అర్థమైనది. తర్వాత అనుకోకుండా శ్రీ పెసల సుబ్బరామయ్యగారు వ్రాసిన పుస్తకాలు ఒక మిత్రునిద్వారా మా దగ్గరికి వచ్చాయి. ఆయన ఎందుకిచ్చాడో నాకు తెలియదు. పుస్తకాలు చదవడం మొదలు పెట్టాము. దీక్ష చేయడం, అదిగాక వెంకయ్యస్వామి సమాధి మందిరంలో హారతులు, నైవేద్యాలు పెట్టడం వగైరా ఈ పుస్తకములద్వారా నాకు తెలిసింది. ఇది చదివిన తర్వాత మనమెందుకు చేయకూడదు అని తెల్లవారి 3 గం॥లకు లేచి స్నానాలు చేసి 40 రోజులు దీక్ష చేసాను. నా శ్రీమతికి గుండెజబ్బు కారణంగా వారానికి ఒకసారి రాజమండ్రికి వెళ్ళి మందులు తీసుకొచ్చేవాడిని. దీక్ష మొదలు పెట్టిన వెంటనే ఈ మందుల గొడవ పోయింది. ఆరోగ్యం చాలా బాగున్నది. నేను ఆర్థిక ఇబ్బందుల (financial depression) వల్ల చాలా బాధలలో ఉన్నాను. ఆ ఊబిలోంచి కొంచెం కొంచెం గట్టెక్కుతున్నాని నాకు తోచేది. నాకు BP 240/150 ఉంటుంది ఇలాంటి BP చూచి డాక్టరుకు BP వచ్చేది. అటువంటి BP పోయింది. డాక్టరు దగ్గరికి వెళ్ళితే "ఇది ఏంటి సార్! మీకు BP ఇలా తగ్గి పోయింది" అని అడిగాడు. "అది అంతా స్వామి మహిమ" అని చెప్పాను.

K. విజయానందబాబుగారు, రాజమండ్రి వారు తన దివ్యానుభవాలు ఇలా చెపుతున్నారు. నేను గొప్ప నాస్తికుడను. మా అమ్మ, అక్క చెల్లెండ్రను గుడికి తీసుక పోవలసి వస్తే వాళ్ళను గుడిలోకి పంపి నేను గుడి బయట ఉండి, తిరిగి వారిని ఇంటికి తీసుకొచ్చే నాస్తికుడను. నా వయస్సు 45 సం॥లు. 1999 సం॥లో స్కూటరు యాక్సిడెంటు జరిగి కోమాలో ఉన్నాను.



కొద్దికాలమునకు తలగాయం మానింది. కానీ విపరీతమైన మతి మరుపు వచ్చింది. ఆఫీసుకు సెలవు పెట్టి ఇంట్లో ఉండి వైద్యము చేయించుకుంటున్నాను. నా మిత్రుడొకడు నిత్యం శివాభిషేకం చేయించి ఆ అభిషేకజలం త్రాగమన్నాడు. నా నాస్తిక భావాలు నన్నలా చేయనివ్వలేదు. ఆ మిత్రుడే అభిషేకజలం పంపితే త్రాగాను. బాగా నెమ్మదించింది. మరొక మిత్రుడు కొందరు మహనీయుల చరిత్రలు ఇచ్చారు. వాటిలో శ్రీవెంకయ్యస్వామి చరిత్ర చదివి వారి సమాధి దర్శించసాగాను. నా నాస్తికభావాలన్నీ సమూలంగా పోయాయి.

2003 సం॥లో మాకు శ్రీస్వామివారి అనుభవము మరియొకటి కలిగినది. నాకు శ్రీస్వామివారిపై నమ్మకం కుదిరినప్పటి నుండి అనగా 2000 వ సం॥ ఆఖరు నుండి నేను శ్రీస్వామివారి ఫోటోను ఎప్పుడూ నా షర్టు జేబులో పెట్టుకొని, చేతికి శ్రీస్వామివారి దారము కట్టుకొనెడివాడను. మార్చి 2003 వ సం॥ నందు నేను, నా భార్య, కుమారునితో తణుకులో ఒక విందుకు హాజరై తిరిగి వస్తుండగా గోదావరి నదిపై గల ఒక ప్రదేశము (పిచ్చుక లంక) వద్ద మోటారు సైకిలు ఒక సిమెంటు స్తంభమునకు గుద్దుకొని, నేను, నా కుమారుడు తీవ్రగాయములతో స్పృహ తప్పి పడిపోగా, నా భార్య 20 అడుగుల దూరంలో సొమ్మసిల్లి పడినది. మా కుమారుని ఏడుపునకు ఆమెకు స్పృహ వచ్చి మమ్ములను చూచి ఏడ్చుచూ సహాయము కొరకై దిక్కులు చూడసాగింది. అప్పుడు సమయము సుమారు మధ్యాహ్నం 3 గం॥లు. ఆ సమయములో ఒక పెళ్ళి బృందం ఆటోలో వెళ్ళుచూ మా పరిస్థితి చూచి ఆగిరి. అదే సమయంలో ఎవరో కారులో వెళ్ళుచూ మా పరిస్థితి చూచి ఆగి విషయములు తెలుసుకొని వారి వద్దగల సెల్‌ఫోను ద్వారా మా ఇతర కుటుంబ సభ్యులకు విషయం తెలిపిరి. ఆ సమయంలో నేను తలకు హెల్‌మెట్ ధరించి యుండుటచేత పెద్ద ప్రమాదము నుండి బయట పడితిని.

కాని ఆ తాకిడికి హెల్‌మెట్ పగిలి పోయింది. నాకుమారుని తలకు బలమైన గాయం మరియు కుడిచేయి విరిగినది. నాకు ఎడమ అరచేయి విరిగినది. అప్పుడు ఆ పెళ్ళి బృందం ఆటోదిగి, మాకు ఆటోను ఇవ్వగా మేము నా భార్య సహాయంతో హాస్పిటల్‌కి బయలుదేరినాము. ఆ ప్రదేశములో మా వస్తువులన్నీ చెల్లా చెదురై, నా ప్యాంటు, షర్టు ముళ్ళ తీగకు చుట్టుకొని పూర్తిగా చిరిగిపోయి, శరీరం అంతా గాయములై రక్తసిక్తం కాగా, నా జేబులోని కాగితములన్నీ పోయినవి. కాని విచిత్రముగా నా జేబులోని శ్రీస్వామివారి ఫోటో మరి ఎలా వచ్చినదోగాని సౌమ్మసిల్లి 20 అడుగుల దూరంలో పడిన నా భార్య చేతిలో దర్శనమిచ్చినది. ఆమె స్పృహలోనికి వచ్చినాక చేతిని చూడగా శ్రీస్వామివారి ఫోటో ఉన్నది.

ప్రమాదము జరిగిన ప్రదేశమునగల రక్తం చూచిన వారికి అక్కడ కనీసము ఇద్దరైనా చనిపోయి ఉండవచ్చునని అనుకున్నారట. కానీ మేము ముగ్గురము అంగవైకల్యం లేకుండా బ్రతికి బట్టకట్టినామంటే దానికి శ్రీ వెంకయ్యస్వామి వారి దయయే కారణమని మేము నమ్ముతున్నాము. దీనికి నిదర్శనమే శ్రీస్వామివారి ఫోటో నా భార్య చేతిలో దర్శనం యిచ్చుట. ఈ సంఘటన తరువాత నా భార్యకి శ్రీస్వామివారిపై నమ్మకం ఏర్పడినది.

నగేష్, బెంగుళూరు గారి ఉదంతం. 2001 సం॥లో నేను చావవలసిన పరిస్థితి. స్వామి నా కలలో నీ Life insurence ( జీవిత భీమా) చేసాలేయ్యా అన్నారు. నేను నా తరంలో తీరవు అనుకున్న problems (కష్టాలు) అవలీలగా (చాలా casual ) గా తీరిపోయాయి.

ఏ పరిస్థితులోనైనా నా ఆయుధం పారాయణే. నాకు job (ఉద్యోగం) లేని సమయంలో నేను చేసిన పని రోజూ సాయిబాబా లీలామృతము, వెంకయ్యస్వామి వారి చరిత్ర, గురుచరిత్ర పారాయణము చెయ్యడం. చాలా చిత్రంగా నేనుండేదానికి దగ్గరలో ( 2 నిమిషముల నడక చాలు) ఉద్యోగం చాలా సులభంగా వచ్చింది. చాలా చిత్రంగా నాకు చాలా తక్కువ పరిచయం ఉన్నవాళ్ళు నాకు విపరీతంగా హెల్ప్ చెయ్యడం. ఇదంతా స్వామిప్రేరణే. మనకు స్వామి కృప ఉంటే అడవిలో ఉన్నా కూడా సహాయం దొరుకుతుంది. శత్రువులు కూడా మిత్రులవుతారు. ఈ విషయంలో ఏ మాత్రం సందేహంలేదు.



కర్మ ఫలితం negative గా ఉండవచ్చుగాక విధివ్రాతను నేను పట్టించుకోను. స్వామిని నమ్ముకుంటే అవి నాశనము అవుతాయి. నా లక్ష్యం కర్మఫలితాన్ని, కాలాన్ని శాసించడం.

స్వామి నాకు అనుక్షణం ప్రత్యేక నిదర్శనాలు అవసరమైనప్పుడల్లా ఇస్తున్నారు. అవన్నీ ఎలా చెప్పాలో తెలియడం లేదు.

కొత్తగా చెన్నై వెళ్ళిన రోజుల్లో బరువైన లగేజీతో మా అక్క ఇంటి నుంచి బస్టాండుకు వెళ్ళటానికి సుమారు 3 గంటలు పట్టినది. సరైన బస్టాండు అడ్రస్సు ఎవరూ చెప్పనందున, భాష రాక సామానంతా మోస్తూ విపరీతంగా తిరిగి తిరిగి అలసిపోయాను. శ్రీస్వామిని మనస్సులోనే ప్రార్థించుకున్నాను. ఇంతలో ఒకాయన వచ్చీరాని తెలుగులో తనకి తెలుగు వాళ్ళంటే ఇష్టమని, తను కూడా తెలుగు వాడినని చెప్పి నా సామాను మోసి బస్టాండుకు తీసుకవెళ్ళి, టికెట్టు తన డబ్బులతో కొని పంపించాడు.

చెన్నైలో ఉండేటప్పుడు ఒకసారి ఒక తప్పుడు పనిచేసినందుకు punishment (శిక్ష) గా మౌనంగా ఉంటూ, మంచినీళ్ళు కూడా తాగ కుండా ఉపవాసం ఉంటానని అనుకొన్నాను. 2002 జనవరి 1 న గొలగమూడి గుడిలో మిత్రులు శేషు, జయమ్మగార్లతో మౌనంగా కూర్చున్నాను. సరిగ్గా అర్ధరాత్రి

12 గంటలకు స్వామిని దర్శించుకున్నాను. అందరూ హారతిస్తున్నారు. కొందరు కొబ్బరికాయలు గుండంలో వేస్తున్నారు. నాకు కూడా గుండంలో ఒక కొబ్బరి కాయ వేయాలన్పించింది. కానీ పది రూపాయలిచ్చి కొనటం ఇష్టంలేదు. కొద్ది నిమిషాలలో ఇంకొక మిత్రుడు (బైనబోయిన) తనకని తెచ్చుకున్న కొబ్బరికాయ, నవధాన్యాలు, అగరుబత్తీలు నాచేతిలో పెట్టి, మీ చేత్తో అగ్నిగుండంలో వెయ్యండి అని అన్నారు. ఆ క్షణంలో ఎంత ఆనందంవేసిందో చెప్పలేను. చెప్పలేదు కూడా ఎందుకంటే మౌనం కదా.

ఇంక తరువాత ఉపవాసం స్వామి తీర్థంతో (అభిషేక జలం) విరమిద్దామని అనుకుంటూ స్వామి మందిరంలోకి వచ్చాను. కాని అక్కడ పూజారి అభిషేకజలం అయిపోయిందన్నారు. నేనింకా అలా పక్కన కూర్చున్నానో లేదో ఒకామె ఒక బాటిల్‌తో తీర్థం యిస్తూ 'అన్నా! నీ దగ్గర ఉంచు మళ్ళీ వచ్చి తీసుకెళ్తా 'అంది.

ఇంత ప్రశాంతంగా స్వామిగురించి ఆనందిస్తూ మీకు లెటర్ వ్రాసే ప్రేరణకూడా స్వామి కృపే.

భీమడోలు గ్రామం ఏలూరి సుబ్బారావు చెల్లెలు ధర్మలక్ష్మి ఇలా చెపుతుంది.

ఒకరోజు నేను కళ్ళ డాక్టరుగారి అబ్బాయి అక్షరాభ్యాసం నిమిత్తం ఏలూరు వెళ్ళి బస్సుదిగగానే నీరసం వచ్చింది. అలా వెళితే బాగుండదని మా అన్నగారింటికి వెళ్ళాను. అక్కడ మా అన్నయ్యగారు సుబ్బారావు, వదిన కామేశ్వరి కూర్చుని బాధగా కన్పించారు. ఏమిటలా ఉన్నారని అడిగాను. మా అన్నయ్యగారు అన్నారు 'పుస్తకాల షాపు సీజను బాగా సేల్‌అవుతుందని కొంత డబ్బు అప్పు చేసి సరుకు తెచ్చాను. వంద రూపాయలు కూడా అమ్మలేదు. ఈ విధంగా ఉంటే అప్పులెలా తీరాలి, కుటుంబం ఎలా గడవాలి' అని బాధ పడ్డాడు. నేను నీకేం ఫరవాలేదు శ్రీ



వెంకయ్యస్వామి వారి పుస్తకము పారాయణ చేయమన్నాను. వారలానే చేశారు. ముందు రోజు వంద రూ॥ అయినా అమ్మని సరుకు ఆ రోజు 7500 రూ॥లు అమ్మేసరికి ఆశ్చర్యపడి వెంకయ్యస్వామి నిన్ను నా వద్దకు నా కొరకే పంపినారని సంతోషంగా అన్నారు.

అన్నం తిని పొమ్మన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తే కష్టాలు తప్పవని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

1984 మే నెలలో అక్కింవెంకట్రామిరెడ్డి గొలగమూడి వచ్చి శ్రీస్వామివారి సమాధిని దర్శించి తెల్లవారి ఉదయాన్నే నడిచి ఇంటికి బయలుదేరారు. కొట్టికూటి బుజ్జయ్యగారు వెంకట్రామిరెడ్డిని 'చద్దన్నం తిని బయలుదేరు. చార్జీ ఇస్తాను బస్సులో వెళ్ళు పెద్దవాడివి' అని ఎంత చెప్పినా వినకుండా నడిచి వెళ్ళిపోయాడు. బిరదోలు చెర్లో దోవ తప్పిపోయి తిరిగిన చోటనే తిరుగుతూ ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ బాధ పడుతున్నాడు. మండు వేసవి విపరీతమైన దాహం. కాళ్ళకు చెప్పులు లేవు. బందారాకు కాళ్ళకు అడ్డంగా కట్టుకొని నడుస్తుంటే అది నిలిస్తేగదా? విసిగిపోయి నడుచుటకు శక్తిలేక ఒక బొంతచెట్టు నీడన పడుకున్నాడు. "స్వామీ అట్లా మీ సన్నిధియొద్దగాకుండా ఇట్లా ఇంట్లోనూ గాకుండా మార్గ మధ్యన చంపేస్తున్నావా. ఇక కొంచెం సేపట్లో ప్రాణంపోతుంది. ఈ శరీరాన్ని గ్రద్దలు, బోరవలు పెరుక్కుతింటాయి. చద్దన్నం తినమంటే తినకుండా వచ్చినందుకు ఎంత పనిచేశావు స్వామి" అని బాధపడుతూ విశ్రమించాడు. వెంటనే మేకను పిలుస్తూ 12 సం॥ పిల్లవాడు అటుగా వచ్చి ఈయనను ఏవూరని అడిగి పలకరించాడు. 'అక్కెండుకు పోతుంది అన్ని నీళ్ళు తెచ్చిస్తే చెప్తా'నన్నాడు. వెంటనే ఆ పిల్లవాడు 10 గజాల దూరంలో చెట్లకవతల సముద్రంవలె ఉన్న బిరుదోలు చెరువు చూపించాడు. రెడ్డిగారు తనివితీరా నీరుత్రాగి స్నానంచేసి ఇంటికి

బయలుదేరాడు. నాటి రాత్రి శ్రీస్వామివారు ఈయన స్వప్నంలో కన్పించి " చద్దన్నం తిని బస్సులో పొమ్మంటే వినక వితండంగా పోయ్యేవాళ్ళకు ఇంతేగదా జరిగేది" అన్నారు. అందరి ద్వారా మాట్లాడేది సర్వసాక్షియైన తామేనని ఎరుక పరుస్తున్నారు. ఇక్కడ అన్నంతిని పొమ్మన్నారు. అక్కడ మేకలకాడి పిల్లవానిలాగా నీళ్ళుచూపించింది, ఇప్పుడు స్వప్నంలో బోధిస్తున్నదీ శ్రీస్వామియేనని తెలుసుకొని చెంపలేసుకున్నాడు.

M.భాస్కరరావు (చెన్నై) వారికి వివాహమై 13 సం॥లు అయినా సంతానం కలుగలేదు. డాక్టర్ల చుట్టూ తిరిగారు. ఎన్నో పరీక్షలు చేశారు. ఎవరిలో లోపంలేదు అయినా పిల్లలు ఎందుకు కలగటం లేదో అర్థం కాలేదు. చాలా బాధపడుతున్నారు. ఒకరోజు ఒక స్నేహితుడు కలసి వీరిబాధ విని "సాయిబాబాకు మ్రొక్కుకో పిల్లలు పుడుతారు' అని చెప్పాడు. వీరికి సాయిబాబా అంటే మొదటినుంచి తెలవదు. వీరు వెంకటేశ్వరస్వామి భక్తులు. స్నేహితుడు చెప్పాక సాయిబాబా గుడికి వెళ్ళి 'నాకు సంతానము ప్రసాదించు స్వామి నీ మందిరానికి 9 వారాలు వస్తాను" అని మ్రొక్కుకున్నారు. ఒక వారం వెళ్ళారు. రెండవ వారానికే వీరి భార్యకు ప్రెగ్నెన్సీ అని చెప్పారు. వీరికి ఒక పాప పుట్టింది. పాపకు సాయి అని పేరు పెట్టారు. తరువాత మరల ఇంకొక పాప పుట్టింది. అప్పటినుంచి వీరు భరద్వాజ మాష్టరుగారు రచించిన పుస్తకాలు చదువుతూ పారాయణలు చేస్తున్నారు. కొంతకాలానికి వీరి భార్యకు గర్భసంచిలో ప్రాబ్లమని ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ చేస్తే చిన్నపిల్లలతో ఇబ్బంది అవుతుందని చాలా బాధ పడుతున్నారు. వీరి భార్యకు తెల్లవారితే ఆపరేషన్. ముందటి రాత్రి స్వప్నంలో ఆమెకు వెంకయ్యస్వామి వాళ్ళ పూజ గదిలో కూర్చుని దర్శనమిచ్చారు. ఆమెకు వెంకయ్యస్వామి ఎవరో అర్థంకాక 'ఎవరు నువ్వు ఎందుకు వచ్చావు' అని గట్టిగా అరుస్తూ స్వామిని



అడిగారు. అప్పుడు స్వామి 'ఊరికినే వచ్చానమ్మా, ఏమీలేదమ్మా' అని వెళ్ళిపోయారట. తెల్లవారి ఈ విషయం ఈమె భర్తకు చెప్పింది. వచ్చింది వెంకయ్యస్వామే అని ఆయన అనుకున్నారు. ఆరోజు హాస్పిటల్‌కు వెళ్ళారు. ఆపరేషన్‌కు ముందు స్కానింగ్ చేయాలని అన్నారు. స్కానింగ్ చేసిచూస్తే అంతకు ముందు కనిపించిన ప్రాబ్లమ్ ఇప్పుడు లేదేంటి అని ఆశ్చర్యపోయారు డాక్టరుగారు. ఆపరేషన్ అవసరంలేదు ఇంటికి వెళ్ళిపోండి అన్నారు. ఇదంతా స్వామిదయ అని వారు పరమానంద పడిపోయారు. మరలా కొంతకాలానికి మళ్ళీ ఈమెకు కిడ్నీలో ప్రాబ్లం వచ్చింది. ఏ చికిత్స చేయాలో సరిగా చెప్పలేని స్థితి. డాక్టర్లు 'వారం వారం ఒంటిలోని బ్లడ్ అంతా బయటికి తీసి శుద్ధి చేసి మళ్ళీ ఎక్కించాలి. దీనికి చాలా ఖర్చు అవుతుంది. ఇలా చేస్తుంటే కొన్నాళ్ళు బ్రతకవచ్చు' అన్నారు. బ్లడ్ తీసేటప్పుడు, ఎక్కించేటప్పుడు నరకం అనుభవించాలి. ఆమెకు పరీక్షలు చేస్తున్నారు. ఈయన బాధతో హాస్పిటల్‌లోనే బాబా, వెంకయ్యస్వామి ఫోటోలు పెట్టి అగరవత్తులు వెలిగించి అక్కడే పారాయణ ప్రారంభించారు. ఇది చూచి డాక్టర్లు ఏమిటయ్యా హాస్పిటల్‌ను గుడి చేశావేమిటి అని అడిగారు. అప్పుడు ఈయన మీ పని మీరు కానివ్వండి, నా పని నేను చూసుకుంటాను అని అన్నారు. పదిహేను రోజులు ఉంచాక పరీక్షలు అన్నీ అయ్యాక 'ఈమెకు ఏమీలేదు బాగానే ఉంది' అని అన్నారట. స్వామి ఎంత దయామయుడో చూడండి. ఈయన తండ్రిగారికి ఆరోగ్యం బాగుండేది కాదు. మూడు సం॥ల నుంచి మంచంలో ఉన్నారు. ఆయన తల మాత్రం కదులుతుంది. శరీరానికి ఏ మాత్రం స్పర్శలేదు. ఎటు త్రిప్పాలన్నా ఒకరు వచ్చి త్రిప్పాలి ఆయనకు ఒక ప్రాబ్లమ్ కాదు. యూరిన్ ప్రాబ్లమ్, మోషన్ ప్రాబ్లమ్ చాలా ఉన్నాయి. నాలుగు రోజులకు కూడా మోషన్ అవదట. అప్పుడు ఈయనే చేతులు శుభ్రంగా కడుక్కొని చేతితోనే మోషన్ తీసేవారట. ఇలాసేవలు చేస్తూ నేను స్వామికే సేవ చేస్తున్నాను

అనుకునేవారట. ఇదంతా స్వామి దయకాక మరేమిటి తన తండ్రికి తనే సేవ చేయడం కాక తన పిల్లలతో, భార్యతో కూడా చేయించేవారట. రాను రాను ఈయన తండ్రిగారికి బాధలు ఎక్కువయ్యాయి. యూరిన్ కూడా తెలవకుండానే జరిగేది. డాక్టరు వచ్చి పైపు పెట్టేవారు. రెండు మూడు రోజులకు పైపు మార్చేవారు. ఇలా చేస్తుంటే ఆయనకు అంతా పుండు పడిపోయి నరకయాతన పడుతున్నారు. ఈ బాధను చూడలేక ఈయన గొలగమూడి వెంకయ్యస్వామి దగ్గరకు వచ్చి స్వామి నేను నా తండ్రి బాధను చూడలేక పోతున్నాను. ఆయన ఆరోగ్యం మంచిగా ఉండేలా చెయ్యండి. లేకపోతే ఆయన కర్మంతా పోగొట్టి ఆయన్ని విముక్తుడ్ని చెయ్యండి. నేను 9 వారాలు నీ సన్నిధికి వచ్చి 108 ప్రదక్షిణలు చేస్తాను అని మ్రొక్కుకున్నారు. 3 వారాలు వచ్చారు. 108 ప్రదక్షిణలు చేసారు. 4వ వారానికి వారి తండ్రిగారు కాలం చేశారు. ఎంత కరుణామయుడో శ్రీస్వామివారు. ఆయన బాధను మరణంతో తీసివేశారు శ్రీస్వామివారు.

M. భాస్కరరావు ఇంకొక లీల గురించి ఇలా చెప్పారు. మా తండ్రి చనిపోయాక వెంకయ్యస్వామి సన్నిధిలో కొన్ని నెలలు ఉండి స్వామికి సేవ చేయాలన్న మా తల్లిగారి కోరికను నెరవేర్చే మార్గం చూపమని ప్రార్థించాను. స్వామి విచిత్రంగా ప్రేరణ కల్గించి అక్కడనే ఒక ఇల్లు కొనిపించి మా అమ్మను అక్కడ ఉండి స్వామి సేవచేసుకొనే భాగ్యం కల్గించి అమ్మకోరికను తీర్చే భాగ్యం కల్గించారు. ఇప్పుడు వారం వారం మద్రాసునుంచి వచ్చి స్వామిని మా అమ్మను చూచి వెళ్తుంటాను. ఇది నాకు స్వామి ప్రసాదించిన గొప్పభాగ్యం.

G.L. నరసింహం, భువనేశ్వర్, ఒరిస్సా వారు తెలిపిన స్వామి వారి అద్భుతలీల. స్వామి దయామయుడని, భక్తితో శరణు వేడితే స్వామియే అంతా చూచుకుంటారని అని అనడానికి ఈ క్రింది సంఘటన ఒక నిదర్శనము.



నా భార్య రమణికి తరుచుగా తలనొప్పి, గొంతునొప్పి, ఆస్త్మా, థైరాయిడ్ మరియు సివియర్ సైనస్ ప్రాబ్లమ్ ఉండేవి. మద్రాసులో ఒక పేరు పడిన ఆసుపత్రిలో సైనస్ ఆపరేషన్ చేయించినా ఎటువంటి ఫలితము కనిపించక పోగా లేని బాధలు (కడుపునొప్పి, బరువు తగ్గడం) వచ్చాయి. ఈ బాధలతో, 2002 సం॥లో మా పూజ్య గురుదేవులు శ్రీ శ్రీ శ్రీ సుందరసాయి మహరాజు, విజయనగరం వారి ఆజ్ఞ మేరకు మేము గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి దర్శనం చేసుకొన్నాము. అనతి కాలంలో ఆమె ఆరోగ్యం బాగు పడటం మొదలయ్యింది.

2003 సం॥లో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి దయవల్ల నా భార్య రమణి గర్భవతి అయ్యింది. గర్భవతి అయిన మొదటినెలలోనే తీవ్రమైన కడుపు నొప్పికి గురయ్యింది. డాక్టర్లు గర్భముతో పాటు Fybroid ఉందని కనుక ప్రెగ్నెన్సీని తీసివేయాలని సలహా ఇచ్చారు. లేదంటే చాలా బాధలు పడవలసి ఉంటుందని, ఏమైనా జరగొచ్చు అని చెప్పారు.

దిగులు మనస్సుతో మా పూజ్యగురుదేవులని సంప్రదించాము. మీరు భక్తితో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిని శరణువేడి భారం స్వామి మీద వేసి ప్రార్థన చేయండి. స్వామియే అంతా చూచుకుంటారు అని మా గురుదేవులు చెప్పారు.

నెలలు నిండుతున్న కొద్ది గర్భస్థ బాధలు అధికమయ్యాయి. ఏమి తిన్నా అరిగేది కాదు. వామిటింగ్ సెన్సేషన్ ఎప్పుడూ ఉండేది. శిశువుతో పాటు Fybroid గూడా పెరగసాగింది. తరుచు కడుపునొప్పులు వస్తూ ఉండేవి. మద్రాసులో అపోలో డాక్టర్లు ఏమి చేయలేమని చెప్పారు.

మా గురుదేవుల ఆజ్ఞ మేరకు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి తీర్థం మాత్రం నా భార్య ప్రతిరోజు సేవించేది.

శిశువు కేవలం స్వామి తీర్థంతోనే పెరిగాడు. 9 నెలలు నిండిన

తరువాత శ్రీరామనవమి పుణ్యదినమున నా భార్య మగపిల్లవానిని ప్రసవించినది. అనుకోనిరీతిలో పిల్లవాడితో పాటు Fybroidని గూడా డాక్టరు తీసివేసింది. పిల్లవాడి పరిమాణంలో ఉన్న Fybroid ఒక ప్రక్కగా 50 పైసలు నాణెం పరిమాణంలో ప్రేగుకు అతుక్కొని ఉండటం అపోలో డాక్టర్స్‌ని గూడా చాలా ఆశ్చర్య పరిచింది. తల్లి, పిల్లవాడు క్షేమంగా బయట పడ్డారు.

దయామయుడు, కరుణాసాగరుడు, నమ్మిన భక్తులను కాపాడే శ్రీ వెంకయ్య స్వామివారి లీలలో ఇది ఒక మచ్చు తునక.

ఒక భక్తురాలు తమకు శ్రీ వెంకయ్య స్వామివారు అనుగ్రహించిన దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు.

వీరు, వీరి భర్త, పిల్లలు ఒకసారి శ్రీస్వామి వారి సన్నిధికి గొలగమూడికి వచ్చి మూడు నిద్రలు చేస్తామని చెప్పుకొని చేయకుండానే రెండు నిద్రలు కాగానే బెంగుళూరు వెళ్ళిపోయారు.

వెళ్ళిన తరువాత వీరి భర్తగారికి విపరీతమైన భుజం నొప్పి. ఏమయిందో తెలియదు. నరం చిట్లిందా అని X-ray తీస్తే ఏమి తెలియలేదు. ఊరి జనమంతా వచ్చి చూచారు. రాత్రి నిద్రకూడా లేదు. విపరీతమైన బాధ. ఏ పనీ చేయలేరు. అలా ఉండగా ఆదివారం సాయి సత్యవ్రతాలు కందుకూరిలో జరుగుతున్నాయని వీరు శనివారం సాయంత్రం వెళ్తున్నారు. వెళ్తూ ఎలా ఉందంటే బాధగానే ఉంది అన్నారు.

వీరు సాయంత్రం సాయి సత్యవ్రతాలకు వెళ్ళి మరురోజు సాయంత్రం వచ్చి ఎలా ఉందండి అంటే వారు మాములు మనిషై ఉన్నారు. నొప్పి తగ్గింది అన్నారు. నొప్పి తగ్గటమేమిటి మీరేమీ టాబ్‌లెట్ వేసుకోలేదు గదా! అంటే అపుడు చెబుతున్నారు. వీరు వెళ్ళిన వెంటనే 7 గం॥లకు బాగా నిద్ర పట్టిందట. శ్రీ వెంకయ్య స్వామివారు కలలో నొప్పి పుట్టిన భుజం మీద గట్టిగా



మూడుసార్లు కొట్టారు. ఇంక అది మొదలు నొప్పేలేదు. మామూలుగా బరువులు మోస్తూ మామూలు మనిషైపోయారు. అప్పటినుండి స్వామికి మరల మూడు నిద్రలు చేసి వెళదామని మళ్ళీ ఇప్పుడువచ్చామన్నది.

M.V. సుబ్బారావు, పెనుబర్తి, పెంచలకోన దగ్గర - మా తాతగారు స్వామిని తీసుకొచ్చారు. స్వామి చూపించిన స్థలంలోనే బావి త్రవ్వాము. నీళ్ళు బాగా పడ్డాయి. అంతా బాగుంది. స్వామి ఇలా అన్నారు. "పోవయ్యా! కట్టవ చుట్టూ మునగచెట్లు, చింత చెట్లు వెయ్యండి. బాగుంటుంది." మేము స్వామి మాటలు విని చింత చెట్టుకి, మునగ చెట్టుకి ఏం ఆదాయం వస్తుంది? ఏందోలే, పిచ్చి మాటలు అని ఆనాడు నమ్మలేదు. కానీ కాలాంతరంలో కండలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు వచ్చింది. మా ఊరిని ఆ ప్రాజెక్టులో తీసుకొన్నారు. అందు వల్ల గవర్నమెంట్ కాంపన్‌సేషన్‌గా ప్రతి చింతచెట్టుకు, మునగ చెట్టుకు 20,000/- రూ॥లు ఇచ్చారు. మరే ఇతర చెట్లకు అంత డబ్బు ఇవ్వలేదు. కానీ ఆనాడు స్వామివారి మాటను ఆచరించలేదు. స్వామి చెప్పినట్లు చేసుంటే లక్షల రూపాయలు వచ్చుండేవి.

తిరగా బత్తెన రోశమ్మ, పెనుబర్తి గారి ఉదంతము:

శ్రీస్వామివారు సోమశిల ప్రాంతంలో ఏట్లో ఉన్నప్పుడు రోశమ్మ పెండ్లి వయస్సుకొచ్చిన తన కూతురును బలవంతంగా స్వామి దర్శనానికి తీసుకొచ్చింది. ఆ కూతురుకు స్వామి అంటే నమ్మకంలేదు. స్వామి ఈ అమ్మాయిని చూసి " ఏమమ్మా! గుట్టలు గుట్టలుగా పాపాన్ని పేర బెట్టుకొని వచ్చావే! ఎప్పుడు అనుభవిస్తావు?" అన్నారు. గుట్టలు గుట్టలేంటి, పాపం పేరబెట్టుకోవడమేమిటి, అంతా పిచ్చిమాటలు, పిచ్చి వ్యవహారము, ఛో,ఛో పిచ్చాయనా అనుకొంటూ వెళ్ళిపోయింది. కొన్నాళ్ళకు పెళ్ళి అయ్యాక అత్తవారింటికి వచ్చింది. ఒక కొడుకు, ఇద్దరు అమ్మాయిలు పుట్టారు. అంతా బాగానే

జరుగుతోంది. కొడుకు ఇంటర్‌మీడియట్‌లో హాల్‌టికెట్ రాలేదని విషం త్రాగి అడవిలో చనిపోయాడు. భర్తకూడా చనిపోయాడు. కూతురుకు పిచ్చి పట్టింది. అల్లుడు చాలా రోజులు వైద్యంచేయించి చూశాడు. తగ్గక పోయేసరికి ఆమెను వదిలేసి వేరే పెండ్లి చేసుకొన్నాడు. కాబట్టి కూతురు విధవరాలు, ఈమె దగ్గరే ఉంటున్నారు. కూతురు పిచ్చి కారణంగా భర్తను తీసుకు రమ్మని ఈమెను కొడుతూ ఉంటుంది. కూలి చేసుకొని తినాలి. దీనికి తోడు కూతురు పెట్టే బాధలు పడాలి. స్వామిని ఆనాడు దర్శించినప్పుడు వారు చెప్పిన మాటలు ఇప్పుడు ఎలా నిజమయ్యాయో చూడండి. అప్పుడే పరిష్కార మార్గం అడిగుంటే తప్పక దయతలచేవారు.

మద్దిశెట్టి వెంకట సుబ్బారావు, పెనుబర్తి- నాకు పుట్టుకతోనే కళ్ళులేవు. తరువాత భగవాన్ వెంకయ్యస్వామి మా ఊరికే రావటం జరిగినది. మా నాయనమ్మ నన్ను శ్రీస్వామి వద్దకు తీసుకు పోయింది. స్వామి వారు ఆశీర్వాదములు ఇచ్చి" పుట్టిన నక్షత్రం బట్టి దోషం ఉంది అని చెప్పి, వయస్సు పెరిగే కొద్దీ కళ్ళు తెరుచుకుంటాయి. కంటి చూపుకు ఇబ్బందిలేదు. కానీ శివాలయంలో 3 సోమవారాలు  నూనె పోసి 3 దీపారాధనలు చేయండి మరియు శివాలయము చుట్టూ బిడ్డను ఎత్తుకొని తిప్పించ" మన్నారు. స్వామి యొక్క వాక్కు బ్రహ్మ వాక్కు. ఆ వాక్కుకు తిరుగులేదు. స్వామి చెప్పినట్లు నాకు చూపు వచ్చినది. కళ్ళు పెద్దవి అయినాయి. ఎటువంటి ఇబ్బందిలేదు. నేను B.Sc చదివినాను.

మా తాత మద్దిశెట్టి సోమయ్యకు 6 గురు బిడ్డలు పుట్టి చనిపోవటం జరిగినది. స్వామి ఒక్కసారి మాగ్రామం (పెనుబర్తి) వచ్చారు. స్వామి మా ఇంటికి వచ్చి అగ్నిహోత్రము వేసి, భూమిలో ఉన్న ఎముకలను బయటకు తీసివేసి కాల్చి బూడిద చేయడం జరిగినది. తరువాత ఇద్దరు మగ బిడ్డలు బ్రతకడం



జరిగినది. అందరం సంతోషముగా ఉన్నాము.

K.విజయానందబాబుగారు, రాజమండ్రి

2003వ సం॥లో మా బావగారు తీవ్రమైన అనారోగ్యానికి గురైతే రాజమండ్రి ఆసుపత్రిలో చేర్చినాము. అచ్చట సరైన వైద్యము జరుగక వ్యాధి ముదిరి, విజయవాడ తీసికొని వెళ్ళమన్నారు. అప్పుడు గోదావరి పుష్కర సమయము. మా బావగారిని అతికష్టముపై అంబులెన్సులో నాగార్జున ఆసుపత్రి, కానూరు, విజయవాడకు తీసుకొని వెళ్ళినారు. అచ్చట డా॥ జగన్మోహనరావు దంపతులు, మా బావగారికి అమిత శ్రద్ధతో వైద్యము చేసి, రెండురోజుల వరకు పరిస్థితి చెప్పలేమని చెప్పిరి. నాకు భయం కలిగి అంబులెన్స్‌లో వెళ్ళక, తరువాత రైలులో హాస్పిటల్‌కి వెళ్ళాను. అక్కడ డా॥ జగన్మోహనరావుకు, రాజమండ్రి వైద్యుల అశ్రద్ధ, డబ్బు పిపాస గురించి చెప్పి డాక్టరుగారిని బ్రతిమిలాడి వైద్యం కొనసాగించమని వేడుకున్నాను. ఆ రాత్రి నేను, మా అక్క శ్రీవెంకయ్యస్వామివారి "నామజపం" చేస్తూ గడిపాము.

తెల్లవారినాక ఆసుపత్రినందు ట్రామా యూనిట్‌లో ఉన్న మా బావగారికి పరిస్థితి కొంత మెరుగుపడగా మధ్యాహ్నానికి ట్రామా యూనిట్ నుండి ICUలోకి మార్చినారు. డాక్టరుగారు మాతో 'ఈయన పరిస్థితి విచిత్రంగా మెరుగుపడినది,' అని తెలిపినారు. 3,4 రోజులకు రూమునకు మార్చినారు. తరువాత ఆయనను డిశ్చార్జి చేసిరి. ఇది అంతయూ శ్రీవెంకయ్యస్వామి వారి కరుణ, మరియు మహత్యము తప్ప వేరేదియుకాదు. అనతి కాలములోనే మా బావగారి కేసును గాస్ట్రోయాంత్రాలజిస్టుల సమావేశము లండన్ నందు జరుగగా డా॥ జగన్మోహనరావుగారు ఆ సమావేశములో ఈకేసును వివరించగా అందరు ఆశ్చర్యచకితులైనారట. ఈ కేసు "గిన్నిస్ బుక్" నందు పెట్టవలయునని కూడా అన్నట్లు తెలిసినది. దీని వలన మాకు

శ్రీస్వామివారి అనుగ్రహం ఉంటే ఎంతటి ఆపదనైనా అవలీలగా జయించవచ్చునని అవగాహన అయినది.

తిరుమలశెట్టి వెంకయ్య చెపుతున్నాడు.

ఆరోజుల్లో నేను ఎక్కువగా తులసమ్మగారితో కూడా పనిచేస్తుండే వాడిని. శ్రీస్వామివారితో ఎప్పుడూ ఉండే రోశిరెడ్డి మొదలైన వారు పిలిస్తే తప్ప నేను శ్రీస్వామివారి దగ్గరకు చనువుగా పోయేవాణ్ణి కాదు. ఒకరోజు శ్రీస్వామివారు నాతో అన్నారు. "మొదటి కయ్య కూడా కొంచెం చూచుకోయ్యా" నేనెప్పుడూ సేద్యపు పనులు చేస్తుంటాను గనుక నాకు బాగా అర్థం కావాలని అలా చెప్పారు. శ్రీస్వామివారు తనను మొదటి కయ్యగా పోల్చుకొని చెపుతున్నారు. " నా పనులు కూడా కొంచెం చూస్తుండయ్యా" అనే భావం వచ్చేటట్లు అన్నారు. ఆ మాట అర్థం ఆనాడు నాకు సరిగా అర్థం కాలేదు. ఎందుకిలా అన్నారా అని మాత్రం మదన పడ్డాను. అని చెప్పి కంటతడి పెట్టాడు.

ఒకరోజు నామోకాళ్ళ నొప్పులకు నూనె మర్దించుకుంటూ దూరంగా చెట్లలో ఉన్నాను. మనిషి అవసరమై కేకలు వేస్తే వచ్చాను. ఇప్పుడే ఇలా ఉన్నానే రాబోయే రోజులలో నేనేమి స్వామి పని చేయగలనబ్బా అని మనసులో అనుకుంటున్నాను. వెంటనే శ్రీస్వామివారన్నారు "నాగయ్య మొదటి పూజారిగా ఉంటాడు. నీవు రెండవ పూజారిగా ఉండయ్యా" అన్నాడు. నేనేమిటి పూజారిగా ఉండడమేమిటనుకున్నాను. కానీ కాలాంతరంలో అది నిజమైంది.

ఒకరోజు చిట్టేపల్లెలో శ్రీస్వామి వారున్నారు. నేను ఇంటి దగ్గర పిల్లలను నా తల్లి దండ్రులను వదిలేసి శ్రీస్వామివారి సేవలో ఉన్నాను. ఇట్లా ఉండటం ధర్మంకాదుగదా అని అనుకున్నాను. వెంటనే సర్వజ్ఞమూర్తి నా మనస్సులో మాటకు సమాధానంగా "మీ వాళ్ళు నన్ను వదలినా నేను వాళ్ళను వదలనులేయ్యా"



అన్నారు. అది అక్షరాల నిజం చేశారు.

శ్రీ తొగురు వెంకయ్య గారు, తమ దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు. 1994 సం।। ప్రాంతంలో వీరి కన్నుకు పొరవచ్చింది. ఆపరేషన్ చేయించుకోమంటారా? అని ఒక చీటి, ఆపరేషన్ వద్దని శ్రీ స్వామివారి ఆజ్ఞఅని మరియొక చీటి పెట్టారు. ఆపరేషన్ వద్దని చీటీ వచ్చింది. దీనికి తోడు ఒకరోజు వీరి స్వప్నంలో శ్రీస్వామివారు కత్తి తీసుకొని కళ్ళు ఆపరేషన్ చేస్తానంటున్నారు. శ్రీస్వామివారు మూడుమార్లు అడిగితే వీరే మూడుమార్లు వద్దు స్వామి అని చెప్పారు. అది మొదలు సంవత్సరాలు దొర్లిపోతున్నా కన్ను ఆపరేషన్ చేయించుకోలేదు. ప్రస్తుతం రెండవ కన్నుకూడా పొర వచ్చినందున కనిపించదు. ఏ పుస్తకమూ చదవలేడు. చదివేందుకు ప్రయత్నిస్తే కళ్ళవెంబడి నీళ్ళు కారి నొప్పివస్తుంది. దోవ కనిపించదు. లైట్ల వెలుతురులో అసలే కన్పించదు. ఒక రోజు వీరికి "మౌనబోధ" అనే పుస్తకం పోస్టులో వచ్చింది. పుస్తకం చేతికి తీసుకొని కళ్ళకద్దుకొని పుస్తకం పేరు చదివాడు. కళ్ళనొప్పి లేదు. మహా అద్భుతంగా పుస్తకమంతా చదివినంత వరకు చూపు బాగానే ఉండింది. కళ్ళనీళ్ళు, నొప్పులు లేవు. పుస్తకం చదవడం అయిపోగానే చూపు తగ్గింది. ఈ దివ్యానుభవానికి ముగ్ధుడై వెంటనే గొలగమూడి వచ్చి సమాధి దర్శించి తన కృతజ్ఞతాభావం తెలుపుకోవాలని ఉబలాట పడ్డాడు. కొమారుడు ఇంట్లో లేడు. కోడలు వీరిని ఒక్కరినే పంపేందుకు భయపడుతుంది. ఆటోవానికి చెప్పి రైలెక్కించమనింది. ఈయన రైల్వేస్టేషను దగ్గర ఆటో దిగి అతనిని పంపేశారు. తానొక్కడే ప్లాట్‌ఫారం మీదకొచ్చి రైలెక్కాడు. నెల్లూరులో రైలు దిగి స్టేషన్ బయట వరకు నడచి వచ్చి మరలా R.T.C. బస్టాండు వరకు ఆటోలో వచ్చి బస్సెక్కి గొలగమూడిలో దిగారు. గొలగమూడి రాగానే మరలా చూపు తగ్గింది. స్నేహితుని ఇంటికి రాలేక కర్రతుమ్మచెట్లలో రోడ్డు ప్రక్క

తంటాలు పడుతుంటే ఎవరో పుణ్యాత్ముడు ఆ ఇంటికి తీసుకువచ్చాడు.

కళ్ళు కనిపించక పుస్తకాలు చదవడం మానేసిన వీరికి చూపు నిచ్చి తన దివ్యలీలలు స్వయంగా చదివేటట్లు చేయడమే గాక గొలగమూడికి వచ్చినంత వరకు చూపు ఇవ్వడం, గొలగమూడి చేరగానే చూపు ఉపసంహరించడం ఎంత అద్భుతమో చూడండి. నీ కవసరమైనదంతా నేనే చేస్తాను. చూపులేదని బాధ పడవద్దని శ్రీస్వామివారు వీరికి దివ్యబోధ చేస్తున్నారు. ఈ బోధను వీరి అనుభవం ద్వారా గ్రహించి మనస్సులో శ్రీస్వామివారి ఎడల కొరత లేకుండా జీవించాలని వారికేగాక మనందరికీ శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

జి. సీతామహాలక్ష్మిగారు వ్రాస్తున్నారు. 2000 సం॥లో నేను హైదరాబాద్‌లో మనమడి ఇంటి వద్దవున్నాను. నా కుమారుడు మల్కాజిగిరిలో ఉంటాడు. ఒక గురువారం ఉదయం 6గం॥ అప్పుడు నా కుమారునికి పక్షవాతం వచ్చిందని బయట పడుకోబెట్టి జనం వచ్చి చూస్తున్నట్లు, నేను వెళ్ళేసరికి గేటులోనుంచి మోకాళ్ళ వరకు పంచకట్టుకుని, చేతిలో కర్రతో శ్రీస్వామివారు సరాసరివచ్చి వాణ్ణి చూసి, నావైపు తిరిగి "నేనున్నాను పరవాలేద"ని తన చేతిని తన గుండెకానిచ్చి మాట్లాడకుండా నిలబడి వుండటం అనే దృశ్యం స్పష్టంగా నేను చూశాను. కాని ఆ దృశ్యం కల గాదు. తెల్లవారింది గదా! నా భ్రమ అనుకోవడానికి వీలులేదు. ప్రత్యక్షంగా చూశాను. కళ్ళు తెరిచినప్పటి నుంచీ మనస్సులో నా సంతతిలో ఎవరికో అనారోగ్య సూచన తెలియజేశారనే భావంతో ఆలోచించక తప్పలేదు.

నేనున్నది గాంధీనగర్‌లో మనుమడి ఇంటి వద్ద, నా మూడవ కుమారుడు ఉండేది మల్కాజిగిరి. ఉద్యోగ రీత్యా విశాఖపట్టణం వెళ్ళినట్లు విన్నాను. గనుక ఎవరి గురించా? అనే సందేహంతో



గురువారం గడిచింది. శుక్రవారం మధ్యాహ్నం ఫోను వచ్చింది. నా కుమారుని (గోపీకృష్ణ)కి పక్షవాతం, బ్రెయిన్ హేమరేజ్ వచ్చి CDR హాస్పిటల్లో చేర్చామని విని ఆశ్చర్య పడలేదు. గాభరా పడలేదు. నిన్న ఉదయం స్వయంగా స్వామి చూసి అభయమిచ్చిన దృశ్యం కళ్ళముందు మెరిసింది. ఇంతలో మా మనమడు నాతో "బాబాయిని హాస్పిటల్‌లో జేర్చారని వినికూడా ప్రశాంతంగా కూర్చున్నావేమిట"ని ఆటో పిల్చాడు. స్వామివారి విభూతి, ప్రసాదం, వారిఫోటో, 11 రూ॥ ఒక కొత్త జేబురుమాలలో చుట్టి వెంట తీసుకుని వెళ్ళాను. కానీ అతన్ని చూసే అవకాశం లేదన్నారు. అతని భార్య, అత్తగారు, వాడి స్నేహితులంతా హాలులో కూర్చుని ఉన్నారు. ప్రాధేయపడి అడిగినా వల్లకాదనడం వల్ల నేను నాగురువుగార్ని స్మరించుకుని తిరిగి ఆటో ఎక్కి పోబోతుండగా హాస్పిటల్‌లోనుంచి ఒక వ్యక్తి వచ్చి గోపీకృష్ణ తల్లిగారికి చూడటానికి అనుమతి దొరికింది అంటూ నన్ను సాదరంగా అతన్ని ఉంచిన గది దగ్గరకు తీసుకువెళ్ళి మీరు చూసి వెంటనే రావాలి అని గది తలుపు తీశారు. అవకాశాన్ని దుర్వినియోగ పర్చకుండా నా చేతిలోని విభూతిని నుదుట, చేతికి పెట్టి, ఆ జేబు రుమాలు అతని తల క్రింద పెట్టి వెంటనే బైటికి వచ్చేశాను. ఆ తరువాత నేను వెళ్ళలేదు. ఇంటి దగ్గర నిరంతర పారాయణ జరిగేది.

ప్రాణభయం నుంచి తప్పించుకుని బయట పడినట్లు, ఎమర్జన్సీ రూమ్‌నుంచి సపరేట్ గదికి మార్చారట. మెదడులోని రక్తనాళాలు రక్తప్రసారాన్ని కోల్పోవటం జరిగింది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి, లక్షన్నర రూ॥లు ఖర్చు అవుతుంది. కాలు,చెయ్యి స్వాధీనంలోకి రావటం కష్టం. స్వాధీనంలోకి వచ్చినా చెయ్యి అసలు పనిచేయదు, కాలు మాత్రం ఈడుస్తూ నడవాలి అని హాస్పిటల్ పరీక్షలు పూర్తి చేశాక చెప్పారట. భరించలేని బరువు ఆర్థిక ఇబ్బంది గనుక నిరుత్సాహంతో నిరీక్షిస్తూ కూర్చున్నారట,

భార్య, అత్తగారు, ఆత్మీయులు.

ఒకరోజు ఉదయం ఒక అసాధారణమైన వ్యక్తి గోపీకృష్ణ భార్య దగ్గరికి వచ్చి, "ఇతన్ని ఇక్కడ ఎంతకాలముంచినా ఇంతే గనుక హాస్పిటల్ మార్చండి అని, జేర్చవలసిన హాస్పిటల్ అడ్రస్సు చెప్పడం. అంత డిపాజిట్ మేము కట్టలేమంటే, నేను మాట్లాడుతాను రండి" అని తను వెంట ఉండి హాస్పిటల్ మార్చి, పేషెంటుని ప్రవేశపెట్టాడట. 'ఇక ఇతని సంగతి పూర్తిగా హాస్పిటల్ వారే చూస్తారు. మీరెవరూ కనిపించకండి' అని సలహా ఇచ్చి వెళ్ళిన మహనీయుడు నా దృష్టిలో శ్రీస్వామివారనే నమ్మకం కుదిరి ప్రశాంతంగా ఉన్నాను. గోపీకృష్ణ జీవించడం దుర్లభమని భావించిన బంధు మిత్రులంతా వచ్చి చూసి వెళ్ళారట. కాని నేను మాత్రం వెళ్ళలేదు. 15 రోజులయిన తరువాత ఒకరోజు సాయంత్రం గోపీకృష్ణ భార్య నాకు ఫోనులో, గోపీని ఇంటికి తీసుక వెడ్తున్నామని చెప్పింది. వెంటనే నా మనస్సు దోవ తప్పింది. "పోయాడా" అన్నాను. పూర్తి కులాసాగా ఉన్నాడనే సమాధానం విని మనసారా స్వామిని ధ్యానించటం తప్ప నేనేం చెయ్యగలను?

వాళ్ళుండేదాన్ని బట్టి కదయ్యా మనముండేది అన్న శ్రీవెంకయ్యస్వామివారి మాట నేటికీ ఎంత సత్యమో పై భక్తుల అనుభవాలద్వారా మానవాళి అంతటికీ స్పష్టంగా తెలుస్తున్నది. శ్రీవెంకయ్యస్వామివారు, శ్రీసాయిబాబా, శ్రీభరద్వాజ మాష్టరుగారు ముగ్గురూ దత్తాత్రేయుని అవతారాలే. వారు సద్గురువులు, పరమాత్మ స్వరూపులు కూడా. వారి పట్ల అటువంటి భక్తి, శ్రద్ధ, పట్టుదల,విశ్వాసం, సత్యదీక్ష, సద్బుద్ధి అలవరచుకుని సేవిస్తే వారు సంప్రీతులై మనలను నిరంతరం కనిపెట్టి వారి రక్షణ అందిస్తారని గ్రహించి మనందరము కూడా అటువంటి శ్రద్ధాభక్తులు అలవరచుకునే శక్తి (బుద్ధి) నిమ్మని ఆ సద్గురు మూర్తులను ప్రార్థించుదాము.

*******



## మా యితర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర | 40 రూ॥ |
| 2. | అవధూత బోధామృతం - శ్రీ వారి బోధలు | 15 రూ॥ |
| 3. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ వారితో వారి సేవకుల అనుభవాలు | 15 రూ॥ |
| 4. | అవధూత లీల (ఇంగ్లీషు) | 30 రూ॥ |
| 5. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు , చిన్నది) | 5 రూ॥ |
| 6. | వార్తాలాపము | 150 రూ॥ |
| 7. | అవధూత లీల (తమిళం) | 50 రూ॥ |
| 8. | శ్రీ వెంకయ్య స్వామి (తమిళం , చిన్నది) | 5 రూ॥ |
| 9. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ॥ |
| 10. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ॥ |
| 11. | శ్రీ వెంకయ్యస్వామి పూజ | 1 రూ॥ |
| 12. | వెన్నెల పూలు - శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం | 1 రూ॥ |
| 13. | సాయి కృప - కలిచేడు భక్తుల అనుభవాలు | 1 రూ॥ |
| 14. | దివ్యలీలలు | 1 రూ॥ |
| 15. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ॥ |
| 16. | ధర్మమూర్తి | 1 రూ॥ |
| 17. | పిలిచిన పలికే దైవం | 1 రూ॥ |
| 18. | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము. | 12 రూ॥ |
| 19. | శ్రీ స్వామి కృప | 1 రూ॥ |
| 20. | మౌన బోధ | 1 రూ॥ |
| 21. | గురుస్తుతి | 7 రూ॥ |
| 22. | శ్రీ బూర్లె రంగన్నబాబు గారి దివ్య చరితము | 6 రూ॥ |
| 23. | శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర | 4 రూ॥ |
| 24. | శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర | 2 రూ॥ |
| 25. | శ్రీ యర్ర దర్గాస్వామివారి దివ్య చరిత్ర | 5 రూ॥ |
| 26. | నమ్మలేని పచ్చిసత్యాలు | 1 రూ॥ |
| 27. | శ్రీస్వామివారి భజన పాటలు | 1 రూ॥ |

### ఉచితము

1. మాష్టర్‌గారి సత్సంగము
2. శ్రీ మాష్టారి మంచి మాట
3. శ్రీభరద్వాజగారితో భక్తుల అనుభవాలు
4. మృత్యువుపై ఘన విజయము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. అమృత వాక్కులు
9. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర
10. శ్రీ వెంకయ్య స్వామి (హిందీ)
11. చూచి నేర్చుకో
12. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్‌గారు
13. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం

ప్రతులకు వ్రాయండి : శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు,
గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321.